# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 279 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | బుధవారం 29-07-2026


## రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టిగా కృషి చేద్దాం



- బ్లాక్ స్పాట్లలో తక్షణ చర్యలు చేపట్టాలి – అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేయాలి

8

## అధిక డబ్బులు ఆశపడి... ఉన్న డబ్బులు పోగొట్టుకున్నాడు...

- 72 లక్షల 69 వేలు టోకరా వేసి కాజేసిన కేటుగాళ్ళు....
- ఇల్లు అమ్మితే వచ్చిన 73 లక్షలు... నకిలీ యాప్ లో భారీ పెట్టుబడి....



6

## రెండేళ్ల హైడ్రా ప్రస్థానం నగర రక్షణకు

# కొత్త దిశ

**3,325 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ**

- గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణతో వరదల నియంత్రణ
- రూ.1.50 లక్షల కోట్ల ప్రజా ఆస్తుల పరిరక్షణ
- సుస్థిర హైదరాబాద్ నిర్మాణమే లక్ష్యం





**డెస్క్, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

నగరాన్ని వరదలు, అక్రమ ఆక్రమణలు, జలవనరుల విధ్వంసం నుంచి రక్షించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ (హైడ్రా) రెండేళ్ల ప్రస్థానంలో గణనీయమైన ఫలితాలు సాధించింది. 2024 జూలై 19న ఏర్పాటైన హైడ్రా ఇప్పటివరకు 3,325 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుంది. దీని విలువ సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. చెరువులు, వాగులు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు నగరాన్ని సుస్థిర అభివృద్ధి దిశగా తీసుకెళ్లే చర్యలను హైడ్రా చేపడుతోంది. వేగంగా విస్తరిస్తున్న నగరంలో చెరువుల ఆక్రమణలు, నాలాల కుదింపు, ప్రణాళిక లేని నిర్మాణాల కారణంగా వరదలు, నీటి ఎద్దడి వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. ఒకప్పుడు సహజ వరద నియంత్రణ వ్యవస్థగా పనిచేసిన గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ దెబ్బతినడంతో వర్షాకాలంలో స్వల్ప వర్షానికే అనేక ప్రాంతాలు మిగతా 2 లో..

## తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లకు సీఎం విజ్ఞప్తి

- ప్రధానమంత్రి గ్రామీణ గృహ పథకం కింద కేటాయింపులు కోరిన సీఎం
- ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర సహకారం అందించాలని వినతి
- గ్రామీణ ఉపాధి పథకంలో అదనపు పనుల ప్రతిపాదన
- తెలంగాణ పర్యటనకు కేంద్ర మంత్రికి ఆహ్వానం

**న్యూఢిల్లీ, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ పథకం కింద 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలో పేదలకు సొంత ఇల్లు కల్పించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పనిచేస్తోందని వివరించారు. మిగతా 2 లో..




## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్యానికి బలోపేతం



- ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రితో భాగస్వామ్యంపై సమీక్ష
- జిల్లా ఆసుపత్రుల్లో ఆధునిక నేత్ర చికిత్సల విస్తరణకు చర్యలు

2




## తబ్లీఘీ జమాత్ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు

చాంద్రాయణగుట్టలో జరిగిన సమావేశానికి హాజరు

- మత పెద్దలు, నిర్వాహకులతో మర్యాదపూర్వక భేటీ
- శుభాకాంక్షలు తెలిపిన మాజీ

2



2

రాష్ట్రంలో క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సను మరింత ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది.

## అత్యాధునిక క్యాన్సర్ వైద్యానికి శ్రీకారం

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మూడు సంస్థల అవగాహనా ఒప్పందం
- దేశంలోనే తొలి సమగ్ర ఖచ్చిత క్యాన్సర్ వైద్య విధానం
- జన్యు పరీక్షల కోసం ప్రత్యేక సమగ్ర కేంద్రం ఏర్పాటు

## శాసనసభ కమిటీల తొలి సమావేశం

- మూడు కమిటీల ప్రారంభ సమావేశాలు
- కమిటీల పనితీరుపై స్పీకర్ కీలక సూచనలు
- నూతన నియమావళి రూపకల్పనపై మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదన

**హైదరాబాద్, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీ, నియమాల కమిటీ, నైతిక విలువల కమిటీల తొలి సమావేశాలు మంగళవారం నిర్వహించారు. సమావేశాలకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ప్రభుత్వ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, నైతిక విలువల మిగతా 2 లో..





## భూ వివాదాల పరిష్కారానికి రీ-సర్వే

- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- ప్రతి గ్రామంలో గ్రామసభలతో ప్రజలకు అవగాహన
- కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని సూచన
- అత్యాధునిక సాంకేతికతతో భూముల హద్దుల నిర్ధారణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

## ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి



2

- పరీక్షల పారదర్శకతపై సీఎం దృష్టి
- ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలకు పిలుపు
- కోచింగ్ కేంద్రాల నియంత్రణకు జాతీయ విధానం అవసరం



## నెరెళ్ల బాధితులకు న్యాయం చేయాలి

- గంధం గోపాల్ కుటుంబాన్ని పరామర్శించిన కల్వకుంట్ల కవిత
- బాధ్యులపై చర్యలు, బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్

2

## రాష్ట్రపతిపై పుస్తకాల ఆవిష్కరణ

- ఉపరాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా తొలి ప్రతుల విడుదల
- వారసత్వంపై గర్వంతో ప్రగతి దిశగా సాగాలని రాష్ట్రపతి పిలుపు



2

## తబ్లీఘీ జమాత్ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో నిర్వహించిన తబ్లీఘీ జమాత్ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సి. లక్ష్మారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు సమావేశానికి హాజరైన మత పెద్దలు, నిర్వాహకులను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. సమావేశం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ వారి సేవలను అభినందించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు దేశంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించాలనే సందేశాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. మత, సామాజిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నేతలు అభిప్రాయపడ్డారు. భిన్న మతాలు, సంస్కృతుల మధ్య పరస్పర అవగాహన, సహకారం మరింత బలపడాలని కోరారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో మత పెద్దలు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. దేశంలో శాంతి, ప్రజల సంక్షేమం, సామాజిక సామరస్యం నెలకొనాలని ప్రార్థనలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## భూ వివాదాల పరిష్కారానికి రీ-సర్వే

**హైదరాబాద్, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన భూముల రీ–సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రీ–సర్వే జరుగుతున్న గ్రామాల పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార చర్యలపై రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ–సర్వే కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

రీ–సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులు, భూ యజమానులకు వివరించి వారి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అన్నారు. సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజల సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో సంపూర్ణ పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ–సర్వే పనులను జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించి ప్రతి వారం పురోగతిని సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, కుటుంబ జీవనాధారమని పేర్కొంటూ దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

## అత్యాధునిక క్యాన్సర్ వైద్యానికి శ్రీకారం

**అమరావతి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

అంతర్జాతీయ ఔషధ, జీవసాంకేతిక రంగ ప్రముఖ సంస్థలు ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంతో అమరావతిలో దేశంలోనే తొలి సమగ్ర ఖచ్చిత క్యాన్సర్ వైద్య విధానాన్ని ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ రోగులకు అత్యాధునిక జన్యు పరీక్షలు, జీవసూచిక పరీక్షలు నిర్వహించే సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. వ్యాధిని ప్రారంభ దశలోనే ఖచ్చితంగా గుర్తించి, ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా చికిత్స అందించే విధానాన్ని అమలు చేయనున్నారు. దీనివల్ల చికిత్సలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశాలు పెరుగుతాయని అధికారులు తెలిపారు. అవగాహనా ఒప్పందంలో భాగంగా ఆస్ట్రాజెనెకా సంస్థ అమరావతిలో సమగ్ర జన్యు పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జన్యు విశ్లేషణ, జీవసూచిక పరీక్షలు నిర్వహించి వైద్యులకు ఖచ్చితమైన చికిత్స విధానాన్ని నిర్ణయించేందుకు అవసరమైన సమాచారాన్ని అందించనున్నారు. దీంతో రోగులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు రాష్ట్రంలోనే లభించే అవకాశం ఏర్పడనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం రాష్ట్ర వైద్యరంగానికి కొత్త దిశను చూపుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## రాష్ట్రపతిపై పుస్తకాల ఆవిష్కరణ

**న్యూఢిల్లీ, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పదవీకాలానికి సంబంధించిన ప్రత్యేక ప్రచురణల తొలి ప్రతులను రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రాష్ట్రపతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆ ప్రచురణలను ఆయన అధికారికంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి భవన్ చరిత్ర, సంప్రదాయాలు, సేవా కార్యక్రమాలు, సమగ్ర భాగస్వామ్యం, భారతీయత విశిష్టతను ప్రతిబింబించే ఐదు ప్రచురణలను విడుదల చేశారు. వీటిలో రాష్ట్రపతి భవన్: రాష్ట్ర కా భవన్, సేవా ఔర్ సంవేదనా, సమావేషి సహభాగితా, భారతీయతా కా ఉత్సవ్, అలాగే ప్రముఖులు రచించిన వ్యాసాల ఒడియా సంకలనం 'అమ రాష్ట్రపతి – అమ గౌరవ్' ఉన్నాయి. కార్యక్రమంలో మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఈ చిత్రాలతో కూడిన ప్రచురణలు రాష్ట్రపతి భవన్ సంప్రదాయాలు, నిర్వహణ విధానం, విభిన్న కోణాలను ప్రజలకు చేరువ చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ అత్యున్నత రాజ్యాంగ సంస్థ పనితీరుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడంలో ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ ప్రచురణల అసలు ప్రాధాన్యం దేశ వారసత్వంపై గర్వాన్ని పెంపొందించడంతో పాటు అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు పౌరులకు స్ఫూర్తినివ్వడంలో ఉందని రాష్ట్రపతి తెలిపారు. భారతీయ విలువలు, సాంస్కృతిక సంపదను భావితరాలకు పరిచయం చేయడంలో ఇటువంటి ప్రచురణలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. రాష్ట్రపతి భవన్ చరిత్ర, సేవా దృక్పథం, ప్రజలతో అనుబంధాన్ని ప్రతిబింబించే ఈ ప్రచురణలు పరిశోధకులు, విద్యార్థులు, సాధారణ పాఠకులకు ఉపయోగకరంగా ఉంటాయని కార్యక్రమంలో పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# రెండేళ్ల హైడ్రా ప్రస్థానం నగర రక్షణకు కొత్త దిశ

**మొదటిపేజీ తరువాయి**

జలమయమవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు హైడ్రా చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణ, వర్షపు నీటి సహజ ప్రవాహ మార్గాల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించింది.మొదటి దశలో బతుకమ్మకుంట, నల్లచెరువు, బమృకున్–ఉద్–దౌలా చెరువు, తమ్మిడికుంట, సున్నం చెరువు, ఉప్పల్ నల్లచెరువు సహా ఆరు చెరువులను అభివృద్ధి చేసింది. ప్రస్తుతం మరో 14 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. నగర నాలుగు దిక్కుల్లో అంబీర్ చెరువు, ఫాక్స్ సాగర్, అమీన్ పూర్ పెద్ద చెరువు, సరూర్ నగర్ పెద్ద చెరువులను మినీ ట్యాంక్ బండ్ లుగా తీర్చిదిద్దే పనులు కూడా చేపట్టింది. చెరువుల వద్ద పార్కులు, నడక మార్గాలు, బహిరంగ వ్యాయామ కేంద్రాలు, చిన్నారుల ఆట స్థలాలు ఏర్పాటు చేస్తూ వాటిని ప్రజలకు ఉపయోగపడే జీవన ప్రదేశాలుగా అభివృద్ధి చేస్తోంది. హైడ్రా చేపట్టిన చర్యలతో నగరంలోని పలు ప్రాంతాల్లో వరద ముప్పు గణనీయంగా తగ్గినట్లు అధికారులు తెలిపారు. అమీర్ పేట, కృష్ణానగర్, ప్యాట్నీ, శ్రీరాంనగర్, తమ్మిడికుంట, గురునాథ్ చెరువు, ఖాజాగూడ చెరువు తదితర ప్రాంతాల్లో నాలాల పూడిక తొలగింపు, ఆక్రమణల నివారణ, నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణ ద్వారా వర్షపు నీరు సాఫీగా వెళ్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గతంలో వరదలతో ఇబ్బందులు ఎదుర్కొన్న వేలాది కుటుంబాలకు ఈ చర్యలతో ఉపశమనం లభించిందని వివరించారు. అక్రమ ఆక్రమణల నిర్మూలనలో భాగంగా ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, నాలాలు, రహదారులు, ప్రజావసరాలకు కేటాయించిన భూములను హైడ్రా తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇందులో 2,665 ఎకరాల ప్రభుత్వ భూమి, 454.11 ఎకరాల చెరువు భూమి, 90.39 ఎకరాల పార్కుల భూమి, 25.37 ఎకరాల నాలాలు, 62.18 ఎకరాల రహదారులు, ఫుట్ పాత్ లు, 26.31 ఎకరాల ప్రజావసరాల భూములు ఉన్నాయి. ఐలాపూర్, గాజులరామారం, కొండాపూర్, పీర్జాదిగూడ, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బహదూర్ గూడ, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో భారీ స్థాయిలో ప్రభుత్వ భూములను కాపాడినట్లు అధికారులు వెల్లడించారు. నగరాన్ని వరదల నుంచి రక్షించడం, జలవనరులను పరిరక్షించడం, ప్రజా ఆస్తులను కాపాడడం, పర్యావరణ సమతుల్యతను నెలకొల్పడం వంటి లక్ష్యాలతో హైడ్రా తన కార్యాచరణను కొనసాగిస్తోంది.

## తెలంగాణకు 11.56 లక్షల ఇళ్ల కు సీఎం విజ్ఞప్తి

**మొదటిపేజీ తరువాయి**

గత ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో గృహాల అవసరం గణనీయంగా పెరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు పేర్కొంటూ, వీలైనంత త్వరగా ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధి, జీవనోపాధి కార్యక్రమంలో అదనపు పనులను చేర్చాలని ముఖ్యమంత్రి కోరారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు పంటల వైవిధ్యీకరణకు తోడ్పడే పనులను చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక కేంద్రాలు, వెదురు వనాల అభివృద్ధి వంటి పనులను పథకంలో చేర్చాలని ప్రతిపాదించారు. కొండ ప్రాంతాలు, కొండ వాలుల్లో నీటి నిల్వ కందకాల నిర్మాణం, పండ్ల తోటల్లో తేమ సంరక్షణ పనులు, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులను కూడా గ్రామీణ ఉపాధి కార్యక్రమంలో చేర్చాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో ఉపాధి హామీ పథకం తరహాలో 90 రోజుల పని అవకాశాన్ని కల్పించాలని కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణ ఉపాధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు రాష్ట్రానికి రావాలని శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. సమావేశంలో పలువురు తెలంగాణ ఎంపీలు, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

## శాసనసభ కమిటీల తొలి సమావేశం

**మొదటిపేజీ తరువాయి**

కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాశ్ రెడ్డి, నియమాల కమిటీ సభ్యులు, ఇతర కమిటీ సభ్యులు సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును పర్యవేక్షించే బాధ్యత ప్రభుత్వ హామీల అమలు కమిటీపై ఉంటుందని, ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. శాసనసభ నిర్వహణను మరింత సమర్థవంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా తీర్చిదిద్దడంలో నియమాల కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శాసనసభ గౌరవం కేవలం చట్టాల రూపకల్పనతోనే కాకుండా సభ్యుల ప్రవర్తన, నిబద్ధత, వ్యవహార శైలితో కూడా ముడిపడి ఉంటుందని స్పీకర్ పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని బలోపేతం చేయడం కోసం నైతిక విలువల కమిటీ నిష్పక్షపాతంగా, రాగద్వేషాలకు అతీతంగా పనిచేయాలని సూచించారు. కమిటీ చైర్మన్లకు అభినందనలు తెలియజేశారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, శాసనసభ సభ్యులకు మార్గదర్శకంగా ఉండేది నియమావళి పుస్తకమని, దానికి అనుగుణంగానే సభ నిర్వహణ జరుగుతుందని చెప్పారు. శాసనసభను మరింత సమర్థవంతంగా నడిపేందుకు కమిటీ చైర్మన్లు, సభ్యులు కలిసి నూతన నిబంధనలతో నియమావళిని రూపొందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల శాసనసభలను అధ్యయనం చేసి అక్కడ అమలవుతున్న ఉత్తమ విధానాలను పరిశీలించాలని కూడా సూచించారు. సభలో క్రమశిక్షణ, హుందాతనాన్ని కాపాడడంలో నైతిక విలువల కమిటీ కీలక బాధ్యత వహించాలని మంత్రి అన్నారు. కమిటీ నిర్ణయాలు పారదర్శకంగా ఉండి తెలంగాణ శాసనసభ దేశానికి ఆదర్శంగా నిలిచేలా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ, శాసనసభ తమపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా పనిచేస్తూ సభ గౌరవాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్యానికి బలోపేతం

**హైదరాబాద్, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్ర వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన, సమాన వైద్య సేవలు అందించేందుకు పరస్పర సహకార అవకాశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో 35 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా, వాటిలోని నేత్ర వైద్య విభాగాలు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ ఆసుపత్రుల్లో కంటి పరీక్షలు, దృష్టి కొలత సేవలు, శుక్లాల శస్త్రచికిత్సలు నిరంతరం నిర్వహిస్తూ ప్రతి ఏడాది వేలాది మంది రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర అత్యుత్తమ నేత్ర వైద్య కేంద్రంగా ఉన్న సరోజిని కంటి ఆసుపత్రిలో రెటీనా శస్త్రచికిత్సలు, లేజర్ చికిత్సలు, మెల్లకంటి శస్త్రచికిత్సలు, కార్నియా మార్పిడి, కంటి కణితుల చికిత్స, కనురెప్పల శస్త్రచికిత్సలు, గ్లాకోమా చికిత్సలు వంటి అత్యాధునిక సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నేత్ర వైద్య సేవలను మరింత విస్తరించేందుకు జిల్లా ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ప్రత్యేక నేత్ర శస్త్రచికిత్స గదులు, అవసరమైన పరికరాల ఏర్పాటుకు లోటుపాట్ల అంచనా ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సౌకర్యాల అభివృద్ధిని దశలవారీగా, నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో అమలు చేస్తున్న నవజాత శిశువుల కంటి పరీక్షల పైలట్ కార్యక్రమం విజయవంతమైందని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా ఇతర జిల్లాలకు కూడా విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ కార్నియా సేకరణ కేంద్రాలు (ఐ బ్యాంకులు) ఏర్పాటు చేయడంలో భాగస్వామ్యంపై కూడా చర్చించినట్లు వెల్లడించారు.

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన నేత్ర పరీక్షలు అందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నేత్ర వైద్య సేవల బలోపేతానికి మరిన్ని సహకార రంగాలను గుర్తించేందుకు ఆగస్టు నెలలో ప్రభుత్వ బోధనాసుపత్రులు, నిపుణులు, సంబంధిత వర్గాలతో ప్రత్యేక సదస్సు నిర్వహించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, శాఖ ఉన్నతాధికారులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

## నెరేళ్ల బాధితులకు న్యాయం చేయాలి

**రాజన్న సిరిసిల్ల, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

నెరేళ్ల ఘటనలో మృతిచెందిన గంధం గోపాల్ కుటుంబ సభ్యులను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మంగళవారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ నెరేళ్ల ఘటన తెలంగాణ సమాజం తలదించుకునే సంఘటన అని పేర్కొన్నారు. ఆ ఘటన జరిగిన సమయంలో అధికారంలో ఉన్న కుటుంబంలో తాను కూడా సభ్యురాలినేనని, అందుకు బాధిత కుటుంబాలకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు. నెరేళ్ల ఘటనలో పోలీసుల దాష్టీకానికి పాల్పడిన వారిపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు. అలాగే ఇసుక వ్యాపారంలో ధనదాహంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. బాధ్యులైన పోలీసు అధికారులు, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ జరిగినప్పటికీ ఇప్పటి వరకు నివేదిక వెలువడలేదని కవిత పేర్కొన్నారు. ఆ నివేదికను వెంటనే విడుదల చేయాలని కోరారు. అవసరమైతే బాధిత కుటుంబాలతో కలిసి ఢిల్లీకి వెళ్లి న్యాయం కోసం పోరాటం చేస్తామని ప్రకటించారు. నెరేళ్ల బాధిత కుటుంబాలకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని ఆమె ఆరోపించారు. మృతుడు గంధం గోపాల్ కుటుంబం తొమ్మిదేళ్ల పాటు ఆసుపత్రుల చుట్టూ తిరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అందలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలందరికీ కోటి రూపాయల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనపై రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కవిత పిలుపునిచ్చారు. నెరేళ్ల ఘటనలో చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

## ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- హైడ్రా పనులు కొనసాగుతాయని స్పష్టీకరణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రశ్నపత్రాల లీకేజీలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు తలెత్తలేదని, ఆఫ్‌లైన్ పరీక్షల సమయంలోనే ప్రశ్నపత్రాల లీకేజీ వంటి ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనుమతులు లేకుండానే కోచింగ్ కేంద్రాలు విస్తరిస్తున్నాయని, కొన్ని చోట్ల అవే ప్రశ్నపత్రాల లీకేజీలకు కేంద్రాలుగా మారుతున్నాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితులను అరికట్టేందుకు దేశస్థాయిలో సమగ్ర విధానం రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వవిద్యాలయాల వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం అధిక జోక్యం చేసుకోవద్దని, విద్యా వ్యవస్థ రాష్ట్రాల పరిధిలోనే ఉంటే పారదర్శకత మరింత మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ జరగాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను యూపీఎస్సీ విధానానికి అనుగుణంగా ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతో పరీక్షల నిర్వహణలో పారదర్శకత సాధించామని సీఎం తెలిపారు. విద్యార్థుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడిన కొన్ని సంస్థలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల అవి జాతీయ స్థాయి పరీక్షల వరకు ప్రభావం చూపాయని విమర్శిస్తూ, ఇలాంటి సంస్థలపై కఠిన చర్యలు అవసరమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కొనసాగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ కాలానికి చెందిన బకాయిలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇకపై ప్రతి విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లించే విధంగా ప్రణాళిక రూపొందించామని, అవసరమైన నిధులను ముందుగానే బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 కోట్ల నుంచి రూ.2,400 కోట్ల వరకు ఈ పథకానికి అవసరమవుతాయని పేర్కొన్నారు. హైడ్రా కార్యకలాపాలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. హైకోర్టు ఆదేశాలను ఇంకా పూర్తిగా పరిశీలించాల్సి ఉందని, ప్రభుత్వ స్థాయిలో సమీక్షించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. న్యాయస్థానాల ఆదేశాలను గౌరవిస్తూనే హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజాహితం దృష్ట్యా భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో కాంగ్రెస్ అక్రమాలు

## ఎమ్మెల్యే మాధవరం



**కూకట్ పల్లి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి)**

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు చెందాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంత్రులు, అధికారుల అనుచరులకు కట్టబెడుతోందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో అక్రమంగా కేటాయించిన వివరాలను ఆధారాలతో సహా ఆయన బయటపెట్టారు. ఖైతలాపూర్ లో కేసీఆర్ హయాంలో నిర్మించిన 145 ఇళ్లను అమృత్ నగర్ తండా వాసులకు కాకుండా, దరఖాస్తు చేసుకోని వారికి మంత్రుల పైరవీ లేఖలతో కట్టబెట్టారని ఆరోపించారు. హౌసింగ్ బోర్డు వీసీ, హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లు, ఎండోమెంట్ కమిషనర్ల సిఫార్సులతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ పిసిసి అధ్యక్షుడు డి. శ్రీనివాస్ అల్లుడి పేర్ల మీద ఇళ్లు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.6 లక్షలు చెల్లిస్తేనే ఇళ్లు ఇస్తామనడం పేదలను వంచించడమేనని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా పురుషుల పేరుమీద కూడా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు. ఈ అక్రమాలపై పేదల తరపున పోరాడతానని, అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తాం

- **శిక్షకుడు భరత్‌కు వాలీబాల్, వల అందజేసిన సర్పంచ్..**

**భిక్కనూర్, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

గ్రామంలోని క్రీడాకారులను గుర్తించి వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం అందిస్తూ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని భిక్కనూర్ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పరుగు పందెం క్రీడాకారుల శిక్షకుడు భరత్‌కు వాలీబాల్‌తో పాటు వలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ అందించిన ప్రోత్సాహం యువ క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని పేర్కొంటూ సర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రత్యామ్నాయ పంటల సాగు, జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

- **వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు విధానాలు మార్చుకోవాలని కలెక్టర్ సూచన...**

**కామారెడ్డి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**



వాతావరణ మార్పులు, తక్కువ వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరిపై మాత్రమే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం దోమకొండ రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోందని, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది కూడా వర్షాలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో పెసర్లు, మినుములు, కందులు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యానవన పంటలు వంటి తక్కువ నీటితో సాగయ్యే లాభసాటి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. జల సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, రైతులు తమ పొలాల్లో పంట కుంటలు నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాలను పరిరక్షించవచ్చని తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎంపికైన ఉత్తమ రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులను కలెక్టర్ శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల భద్రతపై కీలక నిర్ణయాలు

- **ఆక్రమణల తొలగింపు, అతివేగ నియంత్రణకు జిల్లా రహదారి భద్రత కమిటీ చర్యలు..**

**కామారెడ్డి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, జాతీయ రహదారులపై భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ (డీఆర్ఎస్సీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ, జాతీయ రహదారుల అధికారులు, పోలీసు, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎన్‌హెచ్–44, ఎన్‌హెచ్–161 జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు నూతనంగా ఏర్పాటు చేసిన హైవే టాస్క్ ఫోర్స్ ద్వారా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా అతివేగ వాహనాల నియంత్రణకు ఎన్‌హెచ్–161 అథారిటీ పోలీసు శాఖకు స్పీడ్ లేజర్ గన్స్ అందజేయాలని సూచించారు. వాటి ద్వారా నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎన్‌హెచ్–161కు సంబంధించిన రహదారి భద్రత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖలకు కలెక్టర్ ఆదేశించారు. ఎన్‌హెచ్–44లో ఎస్ఎస్ నగర్ వద్ద నిర్మాణంలో ఉన్న



ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు 2026 జనవరి నాటికి పూర్తవుతాయని జాతీయ రహదారుల అధికారులు సమావేశంలో వెల్లడించారు.

# కళ్యాణలక్ష్మి–షాదీ ముబారక్‌లో నకిలీ ధ్రువీకరణ పత్రాల ముఠా అరెస్ట్

- **ముగ్గురు నిందితుల అదుపులోకి.. నకిలీ ముద్రలు, కంప్యూటర్ పరికరాలు స్వాధీనం..**

**కామారెడ్డి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి):**






కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల కింద ప్రభుత్వ ఆర్థిక సాయం పొందేందుకు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో భిక్కనూర్‌కు చెందిన తోడెంగల రాజా నరేందర్, తోడెంగల రాజలింగం, ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి బోయిని ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ డా. చందారి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సాంకేతిక ఆధారాల ఆధారంగా భిక్కనూర్‌లోని లహరి జిరాక్స్ అండ్ ఆన్‌లైన్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించి నిందితులను పట్టుకున్నారు. దర్యాప్తులో నిందితులు కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ దరఖాస్తుదారుల నుంచి పత్రాలు సేకరించి, ప్రతి దరఖాస్తుకు రూ.4,500 నుంచి రూ.5,000 వరకు వసూలు చేసినట్లు తేలింది. అనంతరం ప్రభుత్వ వైద్యాధికారుల పేర్లతో నకిలీ సంతకాలు, అధికారిక రబ్బరు ముద్రలు ఉపయోగించి వయస్సు, మొదటి వివాహ ధ్రువీకరణ పత్రాలు తయారు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి కంప్యూటర్ సీపీయూ, ఎల్‌సీడీ మానిటర్, మొబైల్ ఫోన్లు, నకిలీ అధికారిక రబ్బరు ముద్రలు, స్టాంప్ ప్యాడ్, నకిలీ సంతకాల కోసం ఉపయోగించిన పెన్నులు, డిజిటల్ రికార్డులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వానికి జరిగిన ఆర్థిక నష్టం, అక్రమంగా సమర్పించిన దరఖాస్తుల సంఖ్య, ఈ కేసులో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ మధుసూదన్, టౌన్ ఎస్‌హెచ్‌వో నరహరి, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# శ్రీరామ మందిర నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

## హైకోర్టు అడ్వకేట్ పెద్దబచ్చగారి రామ్ రెడ్డి సేవా స్ఫూర్తికి ఘన సన్మానం.

**భిక్కనూరు, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**



భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతున్న శ్రీరామ మందిర నిర్మాణానికి భిక్కనూరు వాస్తవ్యులు, హైకోర్టు అడ్వకేట్ పెద్దబచ్చగారి రామ్ రెడ్డి తన సేవాభావాన్ని చాటుతూ రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఆయన అందించిన సహకారాన్ని గ్రామస్థులు, అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ధార్మిక కార్యక్రమాలకు సమాజంలోని దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం శ్రీరాముని ఆశీస్సులతో రామ్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖశాంతులతో చిరకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు

**శివంపేట, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**




శివంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికను ప్రేమ పేరుతో వేధించిన నిందితుడికి పోక్సో చట్టం కింద ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. 2023 ఫిబ్రవరిలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చాకలి కుమార్, ఇంటర్ చదువుతున్న బాలికను పెళ్లి చేసుకుంటానంటూ వేధించడంతో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి శుభవల్లి నిందితుడిని దోషిగా తేల్చి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

# భవన నిర్మాణ కార్మికులకు ఈ-శ్రమ్, లేబర్ కార్డుల పంపిణీ



**కూకట్‌పల్లి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

భవన నిర్మాణ , ఇతర రంగాల కార్మికులకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కూకట్పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ స్పష్టం చేశారు. ఏ.వి.బి పురంలో గత రెండు వారాలుగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నమోదు చేయించుకున్న భవన నిర్మాణ కార్మికులకు, ఇతర కార్మికులకు బుధవారం ఆయన చేతుల మీదుగా లేబర్, ఈ–శ్రమ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు కార్మిక కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, ఏ.వి.బి పురం జనసైనికులు టి. ప్రసాద్ రావు, వై. దనుజయ్, బి. రాము, జి. దుర్యోధన, డి. కోటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు




**కూకట్ పల్లి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి బుధవారం విస్తృతంగా పర్యటించి పారిశుధ్య పనులను, నీటి నిల్వ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో ఎక్కడా మురుగు, వర్షపు నీరు నిలవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా నీరు నిలిచే సమస్యాత్మక ప్రాంతాలను తనిఖీ చేసి, తక్షణమే పూడికతీత పనులు పూర్తి చేయాలని పారిశుధ్య సూపర్‌వైజర్లను (SFA) ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే పారిశుధ్య ఫిర్యాదులను 12 గంటల వ్యవధిలోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయా విభాగాల సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.

## కైతలపూర్ డబుల్ ఇళ్లు స్థానికులకే ఇవ్వాలి

### కలెక్టర్ కు ఎమ్మెల్యే మాధవరం వినతి



**కూకట్ పల్లి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

కైతలపూర్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానికులకు మాత్రమే కేటాయించాలని, స్థానికేతరుల కేటాయింపులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.మంత్రులు, ఉన్నతాధికారుల సిఫార్సులతో నియోజకవర్గంతో సంబంధం లేని వారికి ఇళ్లు కేటాయించడం వల్ల స్థానిక నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనర్హుల కేటాయింపులను వెంటనే రద్దు చేసి, పారదర్శకంగా అర్హులైన పేదలకు అందించాలన్నారు.అదేవిధంగా అల్లాపూర్ డివిజన్ సర్వే నంబర్ 18లో ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలలు, కమిటీ హాల్, బస్తీ దవాఖానా ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని ప్రహరీ గోడతో రక్షించినందుకు కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే వీటి నిర్మాణ పనులు చేపడతామని, ఇళ్ల కేటాయింపుల వివాదంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పగడాల బాబూరావు, సబియా గౌసిద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసిద్దీన్, బిఆర్ఎస్ నాయకులు సత్యం, వీరారెడ్డి, చాంద్, జావిద్, సంజీవ, జ్ఞానేశ్వర్, శ్యాంసుందర్ రెడ్డి, సంజీవరెడ్డి, జుబేద్, రాము పాల్గొన్నారు.

## షాహిన్ బేగానికి రూ.2.50 లక్షల సీఎంఆర్ ఎఫ్ ఎల్ ఓసీ అందజేత

**కూకట్పల్లి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**



ఆల్విన్ కాలనీ ఫేస్-2 నివాసి షాహిన్ బేగానికి అత్యవసర వైద్య చికిత్స కోసం మంజూరైన రూ.2,50,000 సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాన్ని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు మహత్తరమైన వరమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ప్రజాక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ఆపదలో ఉన్న అభాగ్యులకు ఈ నిధి ఆర్థిక భరోసానిస్తోందని పేర్కొన్నారు. తమకు సహకారం అందించిన గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బాలనగర్ నూతన సీఐకి ఘన సన్మానం



**కూకట్పల్లి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

బాలనగర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్హెచ్ఓ, సీఐగా బాధ్యతలు స్వీకరించిన గౌరీ ప్రశాంత్ను మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్లో శాంతిభద్రతల పరిరక్షణ, మెరుగైన పోలీసు సేవలు అందించడంలో పోలీసు శాఖతో ఎల్లప్పుడూ సమన్వయంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన పోలీసింగ్ ద్వారా వారి విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షిస్తూ నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

## ఐడీపీఎల్ పరిధిలోని భూదాన్ భూములు దళితులకు కేటాయించాలి



**కూకట్ పల్లి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

కూకట్పల్లిలోని ఐడీపీఎల్ ఆధీనంలో ఉన్న భూదాన్ బోర్డు భూములను ఇల్లు లేని నిరుపేద దళితులకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని దళిత సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.కేంద్ర ప్రభుత్వం, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి దళితులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రాజేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ద్వారా సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖలతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు దళిత సంఘాల నాయకులు, స్థానిక సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**వాజేడు, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

వాజేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే ప్రతి శాఖ ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అధికారులకు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.




# హైడ్రా చొరవతో స్కూల్ ముందు నీటి నిల్వకు ఫుల్‌స్టాప్

- **స్కూల్ గేటు వద్ద నిలిచింది నీరు కాదు...వ్యవస్థ వైఫల్యం**
- **నీటిలోనే నడక..విద్యార్థుల బాధకు హైడ్రా అండ**

**కుత్బుల్లాపూర్, జులై 29 (నవజ్యోతి ప్రతినిధి)**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి ప్రధాన రహదారిపై, బాచుపల్లి ఫ్లైఓవర్ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు స్వల్ప వర్షానికే భారీగా నీరు నిలిచిపోవడం విద్యార్థులు, ఉపాధ్యా యులు, పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పాఠశాలకు వచ్చే చిన్నారులు మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు సంగీతా రాణి మాట్లాడుతూ, నీరు ఎక్కువసేపు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి విద్యార్థులకు అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన రాలేదని వారు తెలిపారు. అనంతరం ఈ సమస్యను హైడ్రా బాచుపల్లి టీం-49 దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు వెంటనే స్పందించి సిబ్బందితో కలిసి నీటి నిల్వను తొలగించే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. తక్షణ స్పందనతో సమస్యను పరిష్కరించిన హైడ్రా సిబ్బందికి పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సమస్య పరిష్కారంలో హైడ్రా బాచుపల్లి టీం-49 ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్, మేనేజర్ అశోక్ యాదవ్, సిబ్బంది మహేష్, నిశాంత్, శ్రీధర్, వెంకన్నతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# 31 న మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బోనాలు

- **సంఘం సభ్యులు బోనాల మహోత్సవ కరపత్రికను పులిమామిడి రాజుకు అందజేత**

**సదాశివపేట, జూలై 28 (నవజ్యోతిప్రతినిధి) :**

సదాశివపేట పట్టణంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న మొదటి సారిగా నిర్వహించనున్న సామూహిక బోనాల మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన కరపత్రికను సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి పులిమామిడి రాజుకు సంఘం సభ్యులు అందజేసి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. దీనికి పులిమామామిడి రాజు స్పందించి వారి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ శుక్రవారం మున్నూరుకాపు సంఘ భవనము ఎన్కెపల్లి రోడ్డు నుండి సామూహిక బోనాల ఊరేగింపు వైభవంగా ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దర్శన కార్యక్రమం అనంతరం సంఘ భవనంలో మహా ప్రసాదం, భోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ మహోత్సవంలో మున్నూరుకాపు కులబాంధవులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులుసిద్దాపురం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వెంకటేశం, గంట శివయ్య,అలుగోలు శ్రీనివాస్, సతీష్, శంకర్, చీలం సురేష్, ఖర్చర్ల నరేష్, చెప్యాల అనిల్, కాసాల శ్రీనివాస్, రాము, గంట శేఖర్ పాల్గొన్నారు.



# శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల మహోత్సవంలో పాల్గొన్న పులిమామిడి రాజు

**సదాశివపేట, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి)**

సదాశివపేట పట్టణంలోని పాతకేరిలో సుమారు 200 సంవత్సరాల క్రితం స్వయంభువుగా వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి దేవాలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా దినదినాభివృద్ధి చెందుతోంది. భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా కొలువై ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం తొలి మంగళవారం సందర్భంగా బోనాల మహో త్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా దేవాలయ అధ్యక్షులు తంగడపల్లి మనోహర్ గౌడ్, కళావతి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. తదనాంతరం అధ్యక్షులు మనోహర్ గౌడ్ మాట్లాడుతూ ఈ పౌర్ణమ తరువాత అన్ని కులసంఘాల వారు ఇక్కడ అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని ప్రతి సంవత్సరం భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటారని వారు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు సి.హెచ్. శ్రీనివాస్ గౌడ్, నాగులపల్లి సర్పంచ్ శివన్న, పద్మ మాణిక్యం, జగదీశ్వర్, పొన్న రాములు, పండల జగన్నాథం, మాదాసు రాజు, పరమ దాసు, సోమ శంకర్, ఆలయ కమిటీ సభ్యులు, గౌడ సంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# హైకోర్టు వ్యాఖ్యలను స్వాగతించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

- **పేదల పక్షాన బీఆర్ఎస్ పోరాటానికి న్యాయస్థానం మద్దతుగా అభివర్ణన**
- **హైడ్రా వ్యవహారాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ కోరిన బీఆర్ఎస్**

**కుత్బుల్లాపూర్, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి) :**

హైడ్రా కమిషనర్ వ్యవహార తీరుపై రాష్ట్ర హైకోర్టు చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తూ బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రభుత్వం, హైడ్రా పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైకోర్టు తీర్పు పేద ప్రజల హక్కులకు న్యాయం చేసిన చారిత్రాత్మక పరిణామమని అభివర్ణించారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజలపై ఒత్తిడి, భయాందోళనలు సృష్టించిందని, చట్టబద్ధమైన విధానాలకు బదులుగా అధికార దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. పేదలు, మధ్యతరగతి ప్రజలే హైడ్రా చర్యల వల్ల ఎక్కువగా నష్టపోయారని పేర్కొన్నారు. "తమకు నచ్చిన వారికి నజరానా.. నచ్చని వారికి జరిమానా" అన్న విధంగా హైడ్రా వ్యవహరించిందని విమర్శించారు. హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ పేదల పక్షాన సాగించిన పోరాటానికి నైతిక విజయమని, హైడ్రా కమిషనర్‌పై వచ్చిన వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరికి గట్టి హెచ్చరిక అని అన్నారు. హైడ్రా వ్యవహారాలపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, న్యాయవ్యవస్థ ఇచ్చిన సూచనలను ప్రభుత్వం గౌరవించాలని అన్నారు. హైడ్రాకు మరిన్ని అధికారాలు ఇవ్వాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులను కాపాడాల్సిన వ్యవస్థే ప్రజల్లో భయాందోళనలు సృష్టించే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హైడ్రా విధానంపై సమీక్ష చేసి, ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను రద్దు చేస్తామని తమ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. రాజకీయ విమర్శలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పాలన, హైడ్రా పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తిన ఎమ్మెల్యే, ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన పాలన, రాజ్యాంగ విలువలే పరమావధిగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, వివిధ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు, బిఆర్ఎస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.



# లోకేష్ రాజీనామా కోరుతూ యువజన విద్యార్థి నాయకుల నిరసన ర్యాలీ

**అమలాపురం , జూలై 28:**




డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో వైసీపీ యువజన-విద్యార్థి విభాగాల అధ్యక్షులు పిల్లి సూర్య ప్రకాష్, మిండగుదిటి శిరీష్ ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చెయ్యాలి అనే నినాదంతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం నియోజకవర్గ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మరియు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నీట్ పరీక్ష పత్రాల లీక్, మెగా డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీలు, విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, నిరుద్యోగ భృతి వంటి సమస్యలపై గళం విప్పరు. యువత, నిరుద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్ తెలిపారు. సంతోష్ మాట్లాడుతూ ఈ పోరాటం రాష్ట్రంలోని విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న అన్యాయాలకు వ్యతిరేకంగా చెప్పటిన పోరాటం అని తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన చట్టాలు తీసుకురాకపోతే భవిష్యత్తులో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీతో పాటు మెగా డీఎస్సీ అవకతవకల వల్ల నష్టపోయిన విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, ప్రభుత్వం హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీ విభాగం అధ్యక్షులు తోరం గౌతం రాజ్, విద్యార్థి విభాగం జోనల్ ఇంచార్జీ జిల్లెళ్ళ రమేష్, ముమ్మిడివరం నియోజకవర్గ నాయకులు జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు గంటి సుధాకర్, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు పందిరిపల్లి అమర్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు నడింపల్లి సందీప్ వర్మ, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు పందిరిపల్లి రాజేష్, తాళ్లరేవు మండల యువజన - విద్యార్థి నాయకులు గునిపే విష్ణు, పాము మధు, గంటా దిలీప్, బళ్ల దుర్గాప్రసాద్, అల్లంపల్లి వెంకట రమణ, పితాని నవీన్, బళ్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : ఏసీపీ జి. శంకర్ రాజు




**ఉమ్మడి మెదక్, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

మెదక్ జిల్లా అల్లాదుర్గ్ మండలం ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "అరైవ్ అలైవ్" ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి మల్కాజిగిరి కమిషనరేట్ ట్రాఫిక్ త్రిముల్గెర్రీ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) జి. శంకర్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. విద్యార్థులు ఫుట్‌పాత్‌లపై నడవడం, జీబ్రా క్రాసింగ్‌ల ద్వారానే రోడ్లు దాటడం, ట్రాఫిక్ సంకేతాలను పాటించడం, చట్టబద్ధమైన వయస్సు రాకముందు వాహనాలు నడపకూడదని సూచించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి "ట్రాఫిక్ సేఫ్టీ అంబాసిడర్"గా మారి కుటుంబ సభ్యులు, స్నేహితులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు సంజీవయ్య, ఆంజనేయులు, శ్రీకాంత్, సంతోష్, రాధిక, యాదయ్యతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులందరూ ఓటరు ఫారాలు సమర్పించాలి

**వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**కూకట్పల్లి, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

కూకట్‌పల్లి నియోజకవర్గం గాయత్రీ నగర్ డివిజన్‌లో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు విస్తృతంగా పర్యటించారు. బీజేపీ ఎస్.ఐ.ఆర్ (SIR) మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన పోలింగ్ బూత్‌లను సందర్శించి బి.ఎల్.ఏలు, బి.ఎల్.ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు.ఓటరు గణన గడువు ముగుస్తున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారాలను అధికారులకు అందజేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల దూరం తదితర సమస్యలపై స్పందిస్తూ, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి పరిష్కరించాలని సూచించారు. అనంతరం సీనియర్ నాయకుడు అంకిత్ సింగ్ ఠాకూర్ ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం డివిజన్ నేతలతో సమావేశమై బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



# అత్తింటి వేధింపులకు వివాహిత ఆత్మహత్య

**కూకట్పల్లి, జూలై 28 , ( నవజ్యోతి ప్రతినిధి):**



భర్త, అత్తింటి వారి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా కలకల్ గ్రామానికి చెందిన లలిత కూతురు హైమావతి(29)కి హైదర్ నగర్ కు చెందిన శ్రీకాంత్ తో 2019లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. గత నాలుగేళ్లుగా భర్త శ్రీకాంత్ తో పాటు అత్తామామలు లక్ష్మి , శ్రీరాములు, ఆడపడుచు ధరణి, ఆమె భర్త దానయ్య హైమావతిని వేధిస్తున్నారు. జూలై 27 రాత్రి భర్త తనను చంపేస్తానని బెదిరిస్తున్నాడని హైమావతి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రోదించింది. 28వ తేదీ ఉదయం ఆమె గది తలుపు తీయకపోవడంతో సోదరుడు గణేష్ స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్ కు ఉరేసుకుని కనిపించింది. మృతురాలి తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం...

- **బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక.**
- **శంకర్ పల్లిలో బీఆర్ఎస్ ఘాటు స్పందన.**
- **ప్రజల తరఫున ప్రశ్నించడం మా బాధ్యత – బీఆర్ఎస్.**
- **ప్రశ్నిస్తే రాజకీయాలు అంటారా..? ప్రజాస్వామ్య హక్కును కాలరాస్తున్నారు.**
- **రోడ్ల దుస్థితిపై గళమెత్తితే వ్యక్తిగత విమర్శలుగా చిత్రీకరించడం సరికాదు.**

**ఉమ్మడి రంగారెడ్డి/ శంకర్ పల్లి, జూలై 28, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**



ప్రజా సమస్యలను లేవనెత్తడం ప్రతి ప్రజాస్వామ్యవాది బాధ్యత అని, ప్రజల తరఫున ప్రశ్నించడం తమ రాజకీయ ధర్మమని బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఇటీవల శంకర్ పల్లి ప్రాంతంలోని రహదారుల దుస్థితి, గుంతలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని కొందరు రాజకీయ నాయకులు వ్యక్తిగత కోణంలో చూడడం విచారకరమని పేర్కొన్నారు.

**వ్యక్తులపై కాదు... ప్రజా సమస్యలపైనే మా పోరాటం :**

తాము ఎప్పుడూ వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడలేదని ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకే ప్రశ్నించామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కలిగి ఉంటారని, వారిని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

**ప్రజల ఓట్లతో గెలిచిన వారు ప్రజలకు జవాబు చెప్పాలి :**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న ప్రభుత్వానిదేనని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించకుండా విమర్శలకు మాత్రమే పరిమితం కావడం సరైన విధానం కాదని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడ్డారు.

**ఎన్నికల హామీలు ఎక్కడ..? అమలు ఎప్పుడు..? :**

ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ప్రకటించిన ఆర్థిక సహాయం, పెన్షన్ల పెంపు, రైతులకు ఇచ్చిన హామీలు, కళ్యాణలక్ష్మి , తులం బంగారం, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భరోసా వంటి అంశాల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**శంకర్ పల్లి రహదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి :**

శంకర్ పల్లి మండలంలోని అనేక గ్రామాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, భారీ గుంతల కారణంగా ప్రజలు, విద్యార్థులు, రైతులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని, ప్రభుత్వం వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు.

**మౌలిక వసతుల సమస్యలను విస్మరించవద్దు :**

రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని, ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించే పరిస్థితులను నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు.

**ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ఎవరూ అడ్డుకోలేరు :**

ప్రజల తరఫున ప్రశ్నించడం, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమని, ఆ హక్కును అడ్డుకునే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

**ప్రజా సమస్యలు తీరే వరకు ఉద్యమం కొనసాగుతుంది :**

ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు గ్రామాల్లో, మండల కేంద్రాల్లో, అవసరమైతే జిల్లా స్థాయిలో కూడా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**ప్రజల కోసం పోరాటమే మా అజెండా**

వ్యక్తిగత విమర్శలు, రాజకీయ దూషణలు తమ లక్ష్యం కాదని, ప్రజలకు న్యాయం జరగడం, అభివృద్ధి పనులు వేగవంతం కావడం, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడమే తమ ప్రధాన అజెండా అని పేర్కొన్నారు.

**అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలి :**

ప్రజలు ఎన్నో ఆశలతో ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, ఇప్పుడు ప్రజలు ఎదురు చూస్తున్నది విమర్శలు కాదు – పరిష్కారాలని అన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్ హెచ్చరిక :**

"ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు మా పోరాటం ఆగదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం మా హక్కు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. ప్రజల తరఫున ప్రతి వేదికపై మా గళం వినిపిస్తూనే ఉంటుంది" అని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మండల, గ్రామ శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువజన నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# రోడ్లపై ఆక్రమణలకు బ్రేక్..రంగంలోకి దిగిన సర్కిల్ అధికారులు

- **షాపూర్‌నగర్–సూరారం రహదారికి విముక్తి..ఆక్రమణలపై ఉక్కుపాదం**
- **ఆక్రమిస్తే ఉపేక్ష లేదు..హెచ్చరికతోనే కాదు, చర్యలతోనూ సిఎంసి**
- **రోడ్డు ఆక్రమిస్తే కూల్చివేత తప్పదు..సర్కిల్ అధికారుల స్పష్టమైన హెచ్చరిక**

**కుత్బుల్లాపూర్, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి) :**



ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా, ట్రాఫిక్ సమస్యల నివారణే లక్ష్యంగా సిఎంసి అధికారులు రహదారి ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ పరిధిలోని షాపూర్‌నగర్ నుంచి సూరారం వరకు ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణలను మంగళవారం అధికారులు తొలగించారు. వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న తాత్కాలిక నిర్మాణాలు, రహదారిపై విస్తరించిన ఆక్రమణలను పోలీస్ శాఖ సమన్వయంతో తొలగించి రహదారిని పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్రాఫిక్‌ను సులభతరం చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా గాజులరామారం ఉప కమిషనర్ యూ. వెంకట్ రాములు మాట్లాడుతూ రహదారులను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై ఎలాంటి చర్యలకైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే ఆక్రమణలను గుర్తించి నిరంతరం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి. సరిత సేన్ తమ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.

# ఎక్సలెన్స్ ఇన్ టెక్నాలజీ అవార్డుకు ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ఎంపిక

**సంగారెడ్డి, జూలై 28 (నవజ్యోతి న్యూస్):**

కందిలోని ఐఐటీ హైదరాబాద్ మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిషాంత్ నీనా సక్సేనా ప్రతిష్ఠాత్మక ఎక్సలెన్స్ ఇన్ టెక్నాలజీ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా ప్రకటించారు. సాంకేతిక ఆవిష్కరణలు, వాటిని విజయవంతంగా వాణిజ్యీకరించడంలో చూపిన విశిష్ట కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం అందజేస్తారు. డాక్టర్ నిషాంత్ నీనా సక్సేనా సాధించిన ఈ ఘనత ఐఐటీ హైదరాబాద్‌కు మరో ప్రతిష్ఠను తీసుకువచ్చింది. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. సాంకేతిక రంగంలో పరిశోధనలను సమాజ అవసరాలకు అనుగుణంగా మలుస్తూ వినూత్న ఆవిష్కరణలకు ఆయన అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.



# ఆగని అక్రమ నిర్మాణాలు

## ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు..



**పటాన్చెరు(బొల్లారం), జులై 28(నవజ్యోతి ప్రతినిధి):**

జిన్నారం మండలం బొల్లారం పరిదిలోని బీసీ కాలనీ సమీపంలో సర్వే నంబర్ 42లో ఉన్న ప్రభుత్వ భూమిపై అక్రమంగా నిర్మాణం చేపడుతున్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. ఇటీవల దినపత్రికల్లో "ప్రభుత్వ స్థలాల ఆక్రమణ" అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు, సంబంధిత స్థలాన్ని పరిశీలించి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని కూల్చివేశారు. దీంతో సుమారు రూ.50 లక్షల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు ఇటువంటి చర్యలు కొనసాగుతాయని రెవెన్యూ అధికారులు తెలిపారు.

# ఏడిదుల ఎల్లమ్మ బోనాల వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికి ఘన సన్మానం

- **రామాయంపేట మున్సిపాలిటీ 3వ వార్డులో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు**
- **రేణుక ఎల్లమ్మ యూత్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే,మాజీ మున్సిపల్ చైర్మన్‌కు ఘన స్వాగతం**



**రామాయంపేట, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

రామాయంపేట మున్సిపాలిటీ 3వ వార్డు లోని ఏడిదుల ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ యూత్ సభ్యులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి, ఆలయ జ్ఞాపికను అందజేశారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. బోనాల ఉత్సవాల్లో స్థానిక మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించగా, యువకులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు హాస్నోద్దీన్, శ్రీకాంత్ సాగర్, రోయల్ నవీన్, శ్రావణ్ గౌడ్, మహేష్, శ్రీను, శివ, శ్రీధర్, హరీష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రేణుక ఎల్లమ్మ యూత్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్‌హెచ్‌వో అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు



**మేడ్చల్, జులై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

మేడ్చల్ పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్‌టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ గుప్తా ఆధ్వర్యంలో ఆ సంఘం ప్రతినిధులు మేడ్చల్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేడ్చల్ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్‌హెచ్‌వో దృష్టికి తీసుకువెళ్లారు. సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే పట్టణంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌హెచ్‌వో అంజిరెడ్డిని ఘనంగా సన్మానించి, శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి , సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు మాకం లావణ్య, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దుండిగల్ తండా-2లో ఎల్లమ్మ తల్లి బోనాలకు పలువురికి ఆహ్వానం

- **బోనాల వేడుకలకు ఆలయ కమిటీ విస్తృత సన్నాహాలు**
- **ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల మహోత్సవానికి ఘన ఏర్పాట్లు**



**కుత్బుల్లాపూర్, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి) :**

దుండిగల్ తండా–2లో కొలువుదీరిన శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆగస్టు 1న ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు, ఆగస్టు 2న బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మహోత్సవం సందర్భంగా శాంతిభద్రతలు, భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో దుండిగల్ సీఐ బాల్‌రెడ్డి, డీఐతో పాటు వివిధ ప్రజాప్రతినిధులు, ప్రముఖ నాయకులను ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి మహోత్సవానికి ఆహ్వానించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, శ్రీ ఎల్లమ్మ తల్లి కృపాకటాక్షాలతో బోనాల మహోత్సవం విజయవంతంగా జరిగి, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నెహ్రూ నాయక్, ప్రేమ్‌సింగ్ నాయక్, శాంతాబాయి, హనుమంత్ నాయక్, ప్రవీణ్ నాయక్, శ్రీను నాయక్, సోను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ పునర్నిర్మాణానికి కాంగ్రెస్ నాయకుల విరాళం

- **రూ.51 వేల ఆర్థిక సహాయం అందజేసిన ముప్ప రాంరెడ్డి,ముప్ప శ్రీనివాస్ రెడ్డి**



**పోచారం, జూలై 28,(నవజ్యోతి ప్రతినిధి) :**

మేడ్చల్ నియోజకవర్గం పోచారం డివిజన్ పరిధిలోని ప్రతాప్‌సింగారం గ్రామంలో ఉన్న శ్రీ భవాని చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులు మెడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి మద్దతుగా కీసర మండల మాజీ జడ్పీటీసీ ముప్పు రాంరెడ్డి మరియు నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి సంయుక్తంగా రూ.51,000 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, దేవాలయాల అభివృద్ధి ప్రతి భక్తుడి బాధ్యత అని అన్నారు. ప్రజల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్కా ప్రభాకర్ రెడ్డి, గణపురం కొండలరెడ్డి, పొట్టా పరమేశ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీలో పరీక్షల ఫలితాల విడుదల

**ఉమ్మడి రంగారెడ్డి/మొయినాబాద్, జూలై 28 (నవజ్యోతి):**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీలో 2026 మేలో నిర్వహించిన డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, అగ్రికల్చర్, పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలతో పాటు ఫిజియోథెరపీ, ఫార్మ్–డి ప్రథమ సంవత్సరం ఫలితాలను యూనివర్సిటీ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డా. సిహెచ్.వి. పురుషోత్తం రెడ్డి విడుదల చేశారు. పరీక్షల్లో ఎం.ఫార్మసీ 93.75 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలవగా, ఎం.టెక్‌లో 87.50 శాతం, బీఎస్సీ అగ్రికల్చర్‌లో 85.37 శాతం, అలైడ్ హెల్త్ సైన్సెస్‌లో 75.78 శాతం, బీటెక్‌లో 71.76 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫలితాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకిత భావం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.




భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

- **అభివృద్ధి పనులను పరిశీలించిన విఠల్ నాయక్, తన్నీరు శ్రీహరి**



**కాప్రా, జూలై 28, (నవజ్యోతి ప్రతినిధి) :**

ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ ఎదురుగా, రీడింగ్ రూమ్ సమీపంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషితో నిధులు మంజూరవగా, మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఒకవైపు రూ.50 లక్షలతో ఫంక్షన్ హాల్ నిర్మాణం, మరోవైపు రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జి. విఠల్ నాయక్ మరియు కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు శ్రీహరి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గాంధీనగర్ కాలనీ వాసులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిలకు కృతజ్ఞతలు తెలుపుతూ, తమ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

# అధిక డబ్బులు ఆశపడి... ఉన్న డబ్బులు పోగొట్టుకున్నాడు...

- **72 లక్షల 69 వేలు టోకరా వేసి కాజేసిన కేటుగాళ్ళు ....**
- **ఇల్లు అమ్మితే వచ్చిన 73 లక్షలు... నకిలీ యాప్ లో భారీ పెట్టుబడి....**
- **పలు దాపాలుగా 72. 69.లక్షలు కజేసిన సైబర్ నేరగాళ్ళు**
- **కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న తూప్రాన్ పోలీసులు......**






**తూప్రాన్, 28 జులై (నవజ్యోతి ప్రతినిధి నవీన్) :**

తూప్రాన్ కి చెందిన వ్యక్తి యూట్యూబ్‌లో వచ్చిన స్టాక్ మార్కెట్ పెట్టుబడుల ప్రకటనను నమ్మిన తూప్రాన్‌కు చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ సైబర్ మోసానికి గురై రూ.72,69,973 కోల్పోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన కమ్మరి విఠలాచారి (47), నిరుద్యోగి,మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూన్ 19న యూట్యూబ్‌లో స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు సంబంధించిన ప్రకటనను చూసిన ఆయన, "N114-Elite Chat Hub" అనే వాట్సాప్ గ్రూపులో చేరారు. గ్రూపులో ఉన్న వ్యక్తులు తమను స్టాక్ మార్కెట్ సలహాదారులుగా పరిచయం చేసుకొని, నకిలీ ట్రేడింగ్ యాప్‌ను అసలైన అప్స్టాక్స్ యాప్‌గా నమ్మించి డౌన్‌లోడ్ చేయించారు. యాప్‌లో చూపించిన నకిలీ లాభాలను చూసి నమ్మిన విఠలాచారి, ఇల్లు అమ్మిన డబ్బులను పెట్టుబడులు మరియు ఇతర చార్జీల పేరుతో విడతల వారీగా మొత్తం 72,69,973 లక్షలను వివిధ ఖాతాలకు బదిలీ చేశారు. అనంతరం తన పెట్టుబడి నగదును ఉపసంహరించుకునేందుకు ప్రయత్నించగా, నిందితులు మరింత డబ్బు చెల్లించాలని డిమాండ్ చేయడంతో తాను మోసపోయినట్లు గ్రహించారు. దీంతో బాధితుడు జూలై 25న ఎన్సీఆర్పీ పోర్టల్‌లో అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్ 33707260035876 ద్వారా ఫిర్యాదు నమోదు చేయగా, అనంతరం పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు యూట్యూబ్, సోషల్ మీడియా ద్వారా వచ్చే పెట్టుబడి ప్రకటనలను నమ్మవద్దని, అధికారికంగా ధృవీకరించిన యాప్‌లు, సంస్థల ద్వారానే పెట్టుబడులు పెట్టాలని సైబర్ పోలీసులు సూచించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ నిరసన

- **విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దు: ఏనుగు సుదర్శన్ రెడ్డి**

**ఎదులాబాద్,జూలై 28,(నవజ్యోతి ప్రతినిధి) :**




మేడ్చల్ రూరల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు రాగం అర్జున్ ఆధ్వర్యంలో చేపట్టిన "ఫీజుల బకాయి – బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా ఎదులాబాద్ డివిజన్ పరిధిలోని మెగా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలకు మద్దతుగా విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. బకాయిలు విడుదల కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థులు చదువులకు దూరం కాకుండా ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్,చలువాది ప్రవీణ్ రావు,శివ నాయక్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,బసవరాజు గౌడ్, భాస్కర్ గౌడ్,కొమ్మిడి విక్రాంత్ రెడ్డి,సుర్వి అనిల్

# సమాచార హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి...

- **సమాచారం ఇవ్వని అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవు.**
- **తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ చైర్మన్.**
- **ప్రజల సమాచార హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం.**
- **తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ చైర్మన్‌ను కలిసిన ప్రతినిధి బృందం.**
- **ప్రజలకు సమాచారాన్ని అందించడం అధికారుల చట్టబద్ధ బాధ్యత.**

**హైదరాబాద్, జూలై 28, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**




ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు సమాచారాన్ని తెలుసుకునే హక్కు అత్యంత విలువైనదని, సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలు కోరిన సమాచారాన్ని అధికారులు తప్పనిసరిగా అందించాలని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ చైర్మన్ స్పష్టం చేశారు. సమాచారాన్ని ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసే అధికారులపై వారి హోదాతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు బండి నరసింహ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై వినతిపత్రం సమర్పించింది.

**సమాచారం ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యంపై ఆందోళన...**

ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖలకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు సమర్పించినప్పటికీ, కొంతమంది అధికారులు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన సమాచారాన్ని అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రతినిధి బృందం కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లింది. దీనివల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించింది.

**చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు...**

ఈ అంశంపై స్పందించిన తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ చైర్మన్, సమాచార హక్కు చట్టం ప్రతి ప్రభుత్వ అధికారిపై స్పష్టమైన బాధ్యతను విధిస్తుందని తెలిపారు. చట్టంలో పేర్కొన్న గడువులోగా ప్రజలకు సమాచారాన్ని అందించడం అధికారుల విధి అని, ఆ బాధ్యతను విస్మరించిన వారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రజల హక్కులను పరిరక్షించడమే లక్ష్యం...**

సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి బలమైన ఆయుధమని, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు. ప్రజల హక్కులకు భంగం కలిగించే చర్యలను సహించబోమని, ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**చైర్మన్ హామీపై హర్షం వ్యక్తం చేసిన ప్రతినిధి బృందం...**

తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ చైర్మన్ ఇచ్చిన హామీపై ప్రతినిధి బృందం హర్షం వ్యక్తం చేసింది. ప్రజల సమాచార హక్కుల పరిరక్షణ కోసం ఆయన చూపుతున్న చిత్తశుద్ధి, నిబద్ధత అభినందనీయమని పేర్కొంటూ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపింది. ఈ సమావేశంలో ఎంఐఎం సీనియర్ నాయకులు సయ్యద్ అల్తాఫ్ హుస్సేన్ (తాడ్‌బండ్ జూ పార్క్), ఎంఐఎం సీనియర్ నాయకులు సయ్యద్ అయూబ్ (మొగల్‌పుర), బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇర్ఫాన్ (బాలానగర్)తో పాటు పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ రోడ్లపై మార్పు..అధికారుల సమిష్టి అడుగు

- **ట్రాఫిక్‌కు కొత్త ఊపిరి..కుత్బుల్లాపూర్‌లో కార్యాచరణ ముమ్మరం**
- **పెండింగ్ పనులపై అధికారుల పదునైన పర్యవేక్షణ**
- **అడుగడుగునా అభివృద్ధి..ప్రతి జంక్షన్‌పై ప్రత్యేక దృష్టి**

**కుత్బుల్లాపూర్, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి):**



కుత్బుల్లాపూర్ జోన్‌లో అభివృద్ధి పనులకు వేగం పెంచడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. జోన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల మధ్య సమన్వయం, పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టుల అమలుపై జోనల్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ లలిత్ కుమార్, ఐఏఎస్ మరియు సైబరాబాద్ ట్రాఫిక్–II డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్ సంయుక్తంగా సమావేశానికి అధ్యక్షత వహించారు. నగరాభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ పరస్పరం అనుసంధానమై ఉన్న నేపథ్యంలో అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని వారు అధికారులకు గుర్తు చేశారు. పోలీస్ స్టేషన్ వారీగా పెండింగ్‌లో ఉన్న జంక్షన్ అభివృద్ధి పనులు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, విద్యుత్ స్తంభాల తరలింపు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, ట్రాఫిక్ సూచిక బోర్డుల ఏర్పాటు, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యల నివారణకు చేపడుతున్న చర్యలను అధికారులు సమగ్రంగా సమీక్షించారు. ఎక్కడ ఆలస్యం జరుగుతోందో గుర్తించి, ఆయా శాఖల బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించారు. ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని ట్రాఫిక్ వ్యవస్థను అందించాలంటే శాఖల మధ్య సమన్వయమే కీలకమని సమావేశంలో అభిప్రాయపడిన అధికారులు, పెండింగ్‌లో ఉన్న ప్రతి పనిని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కూడా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ జోన్‌కు చెందిన డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, జీడిమెట్ల ట్రాఫిక్ ఏసీపీ, జీడిమెట్ల, బాలానగర్, మేడ్చల్, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు, మియాపూర్ ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

# శివ్వాయిపల్లి లో భూభారతి - భూముల రీ-సర్వే పై గ్రామసభ ఏర్పాటు

- **పాల్గొన్న మెదక్ ఆర్డీవో రమాదేవి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు.**
- **భూ రికార్డుల పారదర్శకతకు రీ-సర్వే కీలకమని అధికారుల సూచన**

**రామాయంపేట, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**



రామాయంపేట మండలం శివ్వాయిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రీ–సర్వే గ్రామసభ విజయవంతంగా జరిగింది. గ్రామంలోని భూ రికార్డుల సవరణ, సరిహద్దుల నిర్ధారణ, సర్వే ప్రక్రియపై గ్రామస్థులకు అధికారులు సమగ్రంగా వివరించారు. కార్యక్రమానికి మెదక్ ఆర్డీవో తో పాటు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) హాజరై రీ–సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రీ–సర్వే ద్వారా భూ యజమానుల హక్కులు మరింత స్పష్టత పొందడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గుముఖం పడతాయని తెలిపారు. సర్వే సమయంలో ప్రజలు అధికారులకు పూర్తిగా సహకరించాలని, తమ భూములకు సంబంధించిన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సర్వేలో ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే గ్రామసభలోనే తెలియజేయాలని కోరారు.రీ–సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహిస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వే శాఖ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు, భూ యజమానులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పూర్తి చేయడంలో ప్రతి ఓటరు సహకరించాలి

- **తహసీల్దార్ రజినీ కుమారి**
- **ఇప్పటికే 23 పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం ప్రక్రియ పూర్తి**
- **క్లెయిమ్స్, అభ్యంతరాలు, మరణాలు, షిఫ్టర్లపై క్షేత్రస్థాయిలో రీ వెరిఫికేషన్.**



**రామాయంపేట, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

రామాయంపేట మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తి చేసేందుకు కేవలం ఆరు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని మండల తహసీల్దార్ రజినీ కుమారి తెలిపారు. ఇప్పటికే మండల పరిధిలోని 23 పోలింగ్ కేంద్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాలు, మరణించిన ఓటర్ల వివరాలు, ఇతర ప్రాంతాలకు మారిన (షిఫ్టర్లు) ఓటర్ల సమాచారంపై క్షేత్రస్థాయిలో కచ్చితమైన పరిశీలన నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే ఏఎస్‌డీ (Absent, Shifted, Dead) జాబితాలో ఉన్న ప్రతి ఓటరుపై రీ వెరిఫికేషన్ చేపడుతున్నట్లు తెలిపారు.అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించి, అవసరమైన చోట సరైన సమాచారం అందించాలని, ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రజలు, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ రజినీ కుమారి విజ్ఞప్తి చేశారు.

# అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యం

**అల్వాల్/జూలై 28, (నవజ్యోతి ప్రతినిధి) :**



అల్వాల్ పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఒక మహిళ అదృశ్యం కేసు నమోదు అల్వాల్ లోతుకుంట ఇంద్రానగర్ కాలనీకి చెందిన శ్యామల (25) సం"అనే మహిళ ఎత్తు 5 అడుగులు ఈనెల 5న ఎవరికి చెప్పకుండా ఇల్లు వదిలివెళ్లారు.తన మొబైల్ ఫోన్ ను ఇంట్లోనే పెట్టి బట్టలు ఇతర వ్యక్తిగత వస్తువులను తీసుకొని వెళ్లినట్టు ఆమె భర్త వెంకటేశ్వర్లు అల్వాల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్వాల్ పోలీసులు ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఆమె గురించి ఎలాంటి సమాచారం లభించినా అల్వాల్ పోలీస్ స్టేషన్ నెంబర్లు: ఎస్సై దేవేందర్ 8712554138,8712663259 కు సంప్రదించాలని కోరారు.

# మాతృ, శిశు మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, జూలై 28 (నవజ్యోతి న్యూస్) :**

జిల్లాలో ప్రసవాల సందర్భంగా మాతృ, శిశు మరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటుచేసుకోకుండా అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశ నుంచే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను పూర్తిగా నివారించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాతృ, శిశు మరణాల ఆడిట్‌తో పాటు జిల్లాలో గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం–1994 అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇటీవల నమోదైన ప్రతి మాతృ, శిశు మరణ ఘటనను కేసు వారీగా పరిశీలించారు. ఏ ఆసుపత్రిలో ఘటన చోటుచేసుకుంది, మరణానికి దారితీసిన కారణాలు ఏమిటి, వైద్య సేవలలో ఎక్కడైనా నిర్లక్ష్యం లేదా లోపాలు జరిగాయా అనే అంశాలపై సంబంధిత వైద్య సిబ్బంది నీ ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. వైద్య రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన నివారణ చర్యలను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. గర్భిణులను గర్భధారణ ప్రారంభం నుంచే నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని వైద్య పరీక్షలను సకాలంలో నిర్వహించాలని, హై రిస్క్ ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి తక్షణమే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గైనకాలజిస్టులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గర్భిణికి, ప్రతి నవజాత శిశువుకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవానంతరం తల్లి–శిశువుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా సమర్థవంతమైన కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో PC&PNDT చట్టం–1994ను కట్టుదిట్టంగా అమలు చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## నేడు సంగారెడ్డిలో బీఎల్ఏల కీలక సమావేశం



**సంగారెడ్డి, జూలై 28 నవజ్యోతి ప్రతినిధి) :**

సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన 282 మంది బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) సమావేశం బుధవారం సాయంత్రం 4 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బీఎల్ఏలతో నేరుగా సమావేశమై బూత్‌ల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఓటర్ల వివరాలు, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై సమీక్షించి కీలక సూచనలు చేయనున్నారు. ప్రతి బీఎల్ఏ తమ బూత్‌కు సంబంధించిన పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అందరూ సాయంత్రం 4 గంటలలోపు సమావేశ ప్రాంగణానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి బూత్‌కు సంబంధించిన బీఎల్ఏ తప్పనిసరిగా సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టిగా కృషి చేద్దాం

- **బ్లాక్ స్పాట్లలో తక్షణ చర్యలు చేపట్టాలి – అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**
- **రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాలు**



**సంగారెడ్డి, జూలై 28 (నవజ్యోతి న్యూస్) :**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించి, బ్లాక్ స్పాట్లలో తక్షణ నివారణ చర్యలు చేపట్టడం ద్వారా జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, వాటికి దారితీస్తున్న కారణాలపై అధికారులతో వివరంగా చర్చించారు. ప్రమాదాల నివారణకు ప్రతి శాఖ చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ ప్రమాదం జరిగినా దాని వెనుక ఉన్న కారణాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి, భవిష్యత్తులో అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడం, గుంతలు, ఎత్తుపల్లాలను వెంటనే మరమ్మతు చేయడం, అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయడం, ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే హాట్ స్పాట్లు, రోడ్డు క్రాసింగ్‌ల వద్ద రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైనేజీలు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు జిల్లాలోని ట్రామా కేర్ సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్యులు, అత్యవసర పరికరాలు, అంబులెన్స్ సేవల వివరాలను సమీక్షిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత కాదని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి అమూల్యమైన మానవ ప్రాణాలను కాపాడే దిశగా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, డీఎస్పీలు, రవాణా శాఖ అధికారులు, ఆర్టీసీ ప్రతినిధులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రసీదు లేకుండా రూ.15 వేల వసూళ్లు?

- **ఫీజు పేరుతో అదనపు వసూళ్లు?ఎంఎల్ఆర్ఐటి ఎదుట ఏబీవీపీ ధర్నా**
- **కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించిన ఏబీవీపీ**

**కుత్బుల్లాపూర్, జూలై 29: (నవజ్యోతి ప్రతినిధి) :**

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లపై మరోసారి వివాదం తెరపైకి వచ్చింది. ఎంసెట్ ప్రవేశాల సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకు అదనంగా నగదు వసూలు చేస్తున్నారంటూ ఎంఎల్ఆర్ఐటి కళాశాల యాజమాన్యంపై ఏబీవీపీ ఆరోపణలు చేసింది. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కూకట్‌పల్లి విభాగ్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా దుండిగల్ శాఖ కార్యకర్తలు ఎంఎల్ఆర్ఐటి కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ రేగోడ్ నాగేష్ మాట్లాడుతూ.. ఎంసెట్ ద్వారా కళాశాలలో ప్రవేశం పొందుతున్న విద్యార్థుల రిపోర్టింగ్ సమయంలో నిర్ణయించిన ఫీజుకు అదనంగా రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదనపు మొత్తాలకు ఎలాంటి అధికారిక రశీదులు ఇవ్వకుండా కేవలం నగదు రూపంలోనే తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులపై అనవసర ఆర్థిక భారం మోపడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అదనంగా వసూలు చేసిన మొత్తాల పూర్తి వివరాలను వెల్లడించి, సంబంధిత విద్యార్థులకు రశీదులు అందించాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ వ్యవహారంపై ఉన్నత విద్యాశాఖ అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని, ఆరోపణలు నిజమని తేలితే కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఆశిష్, నాగశేషు, విష్ణు సాయి శర్మ, ఆశ్రిత్, మహేష్, వివేక్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్ తొలగింపుపై
# కుత్బుల్లాపూర్‌లో సంబరాల జల్లు

- **హైకోర్టు నిర్ణయానికి స్వాగతం...పాలాభిషేకాలు, స్వీట్లతో ఆనందోత్సాహం**

**కుత్బుల్లాపూర్, జూలై 29 (నవజ్యోతి ప్రతినిధి) :**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సంబరాల వాతావరణం నెలకొంది. పేట్ బషీరాబాద్ కేంద్రంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున చేరుకుని హైకోర్టు తీర్పును స్వాగతిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు.



న్యాయవ్యవస్థ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టిందంటూ నాయకులు అభిప్రాయపడ్డారు. పలువురు కార్యకర్తలు నినాదాలు చేస్తూ తీర్పుకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మాట్లాడిన పలువురు నేతలు, హైడ్రా వ్యవహారంపై గత కొంతకాలంగా ప్రజల్లో వ్యక్తమైన సందేహాలు, అభ్యంతరాల నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రజలకు న్యాయం జరిగిందనే భావనను కలిగించాయని పేర్కొన్నారు. న్యాయస్థానాలపై ప్రజల విశ్వాసాన్ని ఈ తీర్పు మరింత బలోపేతం చేసిందని అన్నారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని సంబరాలు జరుపుకున్న నాయకులు, కార్యకర్తలు హైకోర్టు తీర్పును చారిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ప్రసాద్ బాబు రాజు మృతి పార్టీకి తీరని లోటు.

**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**వాజేడు, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి):**

వాజేడు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ బాబు రాజు (ప్రసాద్ బాబు) ఆకస్మిక మరణం పట్ల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, ప్రసాద్ బాబు రాజు మరణం కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి కోసం, ప్రజా సేవ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రసాద్ బాబు రాజు ప్రజలతో ఎంతో ఆప్యాయంగా మెలుగుతూ, పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను స్మరిస్తూ నివాళులర్పించిన ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఈయెక్క



కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని ప్రసాద్ బాబు రాజు గారికి ఘనంగా నివాళులర్పించారు.

# నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు...

- **వలస కూలీల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు.**
- **ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ వినూత్న చైతన్య కార్యక్రమం.**

**ఉమ్మడి రంగారెడ్డి/ షాబాద్, జూలై 27 (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**

నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు ప్రతి చిన్నారి విద్యకు దూరం కాకూడదు అనే మహోన్నత లక్ష్యంతో షాబాద్ మండలంలోని మన్మరి గ్రామ ప్రభుత్వ



ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ చేపట్టిన చైతన్య కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంటోంది. కర్నూలు జిల్లాకు చెందిన వలస కూలీల కుటుంబాలు మన్మరి గ్రామానికి ఉపాధి కోసం రావడంతో, వారి పిల్లలు విద్యకు దూరమవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ వెంటనే స్పందించారు. గ్రామ పాలకవర్గ సభ్యులతో కలిసి వలస కూలీల కుటుంబాలను స్వయంగా సందర్శించి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు

# రామాయంపేట రైతు వేదికలో

## ఘనంగా "రైతునేస్తం" 100వ ఎపిసోడ్, విత్తనమేళా కార్యక్రమం.

- **వర్చువల్‌గా రైతులను ఉద్దేశించి ప్రసంగించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు.**
- **ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగు పై రైతులు దృష్టి సారించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్**
- **రైతులకు నాణ్యమైన విత్తనాలు,నానో యూరియా, నానో డీఏపీ పై అవగాహన**
- **ఉత్తమ రైతులకు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు, శాలువాలతో సన్మానం**

**రామాయంపేట, జూలై 28 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):**

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని, తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. మంగళవారం రామాయంపేట రైతు





వేదికలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్, విత్తన మేళా, ప్రత్యామ్నాయ పంటల అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు నేస్తం కార్యక్రమం రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,మార్కెట్ అవకాశాలను చేరవేసే ఉత్తమ వేదికగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆయిల్ పామ్, కోకో, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలు, కూరగాయల సాగును చేపట్టాలని సూచించారు. దీంతో సాగు వ్యయం తగ్గడమే కాకుండా రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని చెప్పారు.విత్తన మేళాలో రైతులకు ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలు,నానో యూరియా, నానో డీఏపీ వినియోగం,పంటల సంరక్షణ పద్ధతులు,సమగ్ర వ్యవసాయ విధానాలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు.నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వర్చువల్ విధానంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఆయిల్ పామ్, ఉద్యాన పంటల సాగును రైతులు విస్తరించాలని కోరారు. జిల్లా ఉద్యానశాఖ అధికారులు మాట్లాడుతూ ఆయిల్ పామ్‌తో పాటు కోకో సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. అర్హులైన రైతులకు ఎకరానికి రూ.50 వేల వరకు సబ్సిడీ, నాణ్యమైన మొక్కలు, సాంకేతిక మార్గదర్శకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ముందస్తుగా నమోదు చేసుకున్న రైతులకు 30 రోజుల్లో ఆయిల్ పామ్, కోకో, కూరగాయల మొక్కలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఉత్తమ రైతులను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శాలువాలతో ఘనంగా సన్మానించి, అవార్డులను తన చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించిన కలెక్టర్, నానో ఎరువులు, ఆయిల్ పామ్ సాగు, కోకో, ఉద్యాన పంటలు, విత్తనాల నాణ్యత, ఆధునిక సాగు పద్ధతులపై స్టాల్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా చేరవేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రతాప్ సింగ్, మండల స్పెషల్ ఆఫీసర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య, వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత, ఆత్మ పీడీ రుద్రమూర్తి, ఏడీఏలు వినయ్, సోమలింగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఎంపీడీవో షాజోలొద్దీన్, మండల వ్యవసాయ అధికారులు ప్రవీణ్‌కుమార్, యాదగిరి, వందన, ఏఈఓలు ప్రవీణ్, సాయికృష్ణ, సందీప్, జాబెరుల్ల, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN